క్లుప్తంగా

రత్నగిరిపై భక్తి గీతాలాపన



రత్నగిరిపై భక్తి గీతాలు ఆలపిస్తున్న భజన బృందాలు

అన్నవరం: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో బుధవారం భక్తి గీతాలు ఆలపించారు. 53 భజన సంఘాలకు చెందిన 400 మంది భజన కళాకారులు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భక్తి గీతాలాపన చేశారు. దేవస్థానం ఈఈ వీర్ల సుబ్బారావు భజన కళాకారులకు జ్ఞాపికలు అందచేశారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును ఏఈఓ కృష్ణారావుకు అందజేస్తున్న శివపార్వతి

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బేతు శివపార్వతి రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. ఈ మేరకు బుధవారం దేవస్థానం అధికారులకు చెక్కు అందజేశారు. ఏటా మార్చి 26న అన్నదానం చేయాలని దాత కోరారు. వారికి అన్నదానం బాండ్ ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి: మండలంలోని వాకదారిపేట కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు లేని వారు, బడి బయట పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 11 లోపుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టెన్త్ పరీక్షలకు 23 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. కిర్లంపూడి జూనియర్ కాలేజ్, జగపతినగరం ప్రగతి ప్రైవేట్ పాఠశాల, కిర్లంపూడి, గెద్దనాపల్లి, తామరాడ, బూరుగుపూడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫిజికల్ సైన్స్ పరీక్షలకు 1080 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 1057 మంది హాజరయ్యారు. 23 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు.

వరికి కనీస మద్దతు ధర చెల్లించాలి

గోకవరం: రబీలో సాగు చేసిన ఆర్‌ఎస్‌ఆర్ 15408 వరి రకానికి కనీస మద్దతు ధర చెల్లించాలని మండలంలోని రంపయర్రంపాలెం రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సాయిప్రసాద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నరుకుల నానిబాబు తదితరులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 65 మంది రైతులు సన్నరకమైన ఆర్‌ఎస్‌ఆర్ 15408 సాగు చేశామన్నారు. మిల్లర్లు మొదటి వారం సన్నరకాలను రూ.1850కు కొనుగోలు చేశారని, ప్రస్తుతం ధర బాగా తగ్గించి కేవలం రూ.1450 మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. దీనిపై అధికారులు స్పందించి కనీస మద్దతు ధర రూ.1600 చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సాయిప్రసాద్ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వేములపాలెంలో బాధిత కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన పిల్లి సతీష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చందక నాని, తుట్టా గోవింద్, కోలా తాతబాబు, దెందుకూరి హరిరాజు, కోనా బాబ్జి, యాళ్ల ఏసుబాబు, కోలా సూరిబాబు, దోమలంక బాబ్జి, అంబటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

29న కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఈ నెల 29న కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు బుధవారం తెలిపారు. తాత్కాలిక చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

కూలేందుకు సిద్ధంగా..



కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చిన ప్రత్తిపాడు సచివాలయం-2 భవనం

- ప్రమాదకరంగా తహసీల్దార్ కార్యాలయం
- వర్షం వస్తే ఆఫీసు జలమయం
- కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన భవనంలోకి మార్పు

ప్రత్తిపాడు: పైన పటారం...లోన లొటారం... సామెత స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సరిపోతుంది. ఈ కార్యాలయం పూర్తిగా శిథిలై బీటలు వారింది. ఇటీవల ఈ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, ప్రమాదకరంగా ఉన్న కార్యాలయాన్ని మరో సురక్షిత భవనంలోకి మార్పు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం కార్యాలయాన్ని స్థానిక సచివాలయంలోకి మార్చారు.

45 ఏళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో..

గతంలో పాత కోర్టు భవనంలో ప్రత్తిపాడు తాలూకా కార్యాలయం ఉండేది. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సుమారు 1976లో తాలూకా కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభించారు. దీనిని 1979 డిసెంబర్ 23న అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్.నారాయణ ప్రారంభించారు. తాలూకా స్థాయి నుంచి తాహసీల్దార్, మండల రెవెన్యూ కార్యాలయం తిరిగి తాహసీల్దార్ కార్యాలయంగా మార్పు చెందుతూ వచ్చిందే తప్పా దీనికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. 45 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించిన ఈ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే కార్యాలయ గదుల్లోకి నీరు చేరి, విలువైన రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. రెవెన్యూ రికార్డులను సంరక్షించుకోవడానికి సిబ్బంది పడుతున్న తిప్పలు ఇన్నీఅన్నీ కావు. ఏళ్ల తరబడి మరమ్మతులు లేక సిబ్బందితో పాటు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జిల్లా కలెక్టర్ చొరవతో...

జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ జనవరి నెలలో తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, భవన దుస్థితిని గమనించారు. ప్రమాదకరంగా ఉన్న భవనంలో విధులు నిర్వహించడంపై విస్మయం వ్యక్తం చేశారు. తక్షణమే కార్యాలయాన్ని మరో సురక్షిత భవనంలోకి మార్పు చేయాలంటూ ఆదేశించారు. ఇటీవల అసిస్టెంట్ కలెక్టర్ భావన మరోసారి ఈ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నేడో రేపో కూలిపోతుందన్న భయంతో తక్షణమే సచివాలయం భవనంలోకి మార్పు చేశారు.

సచివాలయ భవనంలోనే విధులు



ప్రమాదకరంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని సచివాలయం-2లోకి మార్పు చేశాం. బుధవారం నుంచి పూర్తి స్థాయిలో రెవెన్యూ విధులన్నీ ఇక్కడే కొనసాగిస్తున్నాం.మండల ప్రజలు గమనించాలని కోరుతున్నాం.

– ఎం.సూర్యప్రభ, తహసీల్దార్, ప్రత్తిపాడు.

నల్లరాయి క్వారీల పరిశీలన



ములగపూడిలో నల్లరాయిని క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేష్

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో సర్వే నెంబర్-1లో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీలను తహసీల్దార్ ఎస్.నరేష్ బుధవారం పరిశీలించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీల్లోంచి అక్రమంగా బండరాళ్లను తరలిస్తున్నారనే ఆరోపణల మేరకు అధికారులు క్వారాలను తనిఖీ చేశారు. సర్వే నంబరు-1లో 600 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉందన్నారు. ఈ కొండపై పలువురు అధికారికంగాను, అనధికారికంగాను నల్లరాయి క్వారీలు నిర్వహిస్తున్నట్లు ఆయన గుర్తించారు. ఎన్ని క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి, ఎన్ని క్వారీలను అనధికారికంగా నిర్వహిస్తున్నారనే విషయం మైనింగ్ అధికారులు చెప్పాల్సి ఉందన్నారు. తాము పరిశీలించిన ప్రాంతంలో గతంలో క్వారీ నిర్వహణ చేపట్టినట్లు గుర్తించామన్నారు. సంబంధిత క్వారీలో ఎలాంటి యంత్రాలు గాని, నల్లరాయి తరలించే వాహనాలు గాని లేవన్నారు. ఈ క్వారీకి అనుమతులు ఉన్నాయా ? లేదా ? అనే విషయం మైనింగ్ అధికారులు తెలిపాలన్నారు. సర్వే నంబర్-1 ఎన్ని క్వారీలకు అనుమతి ఉంది, ఎన్ని క్వారీలు అనమతులు లేదు అనే విషయం మైనింగ్ అధికారులతో కలసి పరిశీలిస్తే తెలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఎ.శ్రీనివాస్, విలేజ్ సర్వేయర్ కుశరాజు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాపు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ బుధవారంతో ముగిసినట్టు చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. విద్యార్థులకు ఎడ్జ్ ఏఐ, ఐఓటీ, ఇంటిలిజెన్స్ అంశంపై బ్రెయినోవిజన్ ప్రొఫెసర్ వి.సాయి పవన్ అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

జగ్గంపేట: స్థానిక రైతు భరోసా కేంద్రం-2లో బుధవారం ఎరువుల వినియోగం, భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఏఓ శ్రీరామ్ తెలిపారు.జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి, డీఆర్సి ఏఓ సంజీవ్ కుమార్, భూసార పరీక్ష కేంద్రం ఏఓ పవిత్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, తదితర అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి మూడు నెలలకొకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



శంఖవరం సదస్సులో మాట్లాడుతున్న ప్రకృతి సాగు ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియజర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

శంఖవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియజర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ బడ్జెట్ కార్యచరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలియజర్ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. తోటలు పెంపకం, నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ, మండల వ్యవసాయాధికారి పి.గాంధీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

కోటనందూరు: నిసారమైపోతున్న పంట భూములను రక్షించుకోవాలంటే రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పంటలపై క్రిమి సంహారక మందులు వినియోగం పెరిగిపోవడంతో పొలాలు నిస్సారమైపోతున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయడం వలన పంట పొలాలతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఏపీఎం సూర్యకుమారి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలంతా సేంద్రియ విధానంలో కిచెన్ గార్డెన్లను తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు,డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కిర్లంపూడి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025పై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి గో ఆధారిత ఎరువులు, బీజామృతం, జీవామృతం, కషాయాలను వినియోగించాలన్నారు. ప్రకృతిసాగు ద్వారా అధిక లాభాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నాయుడు, ఎంటి రామలక్ష్మి, ఏపీఎం వేధకుమారి, శేషుబాబు, బచ్చల శ్రీను, గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య వేడుకలకు సర్వం సిద్ధం

- నూకాలమ్మతల్లి ఆలయాలు ముస్తాబు
- ఏర్పాట్ల పూర్తి చేసిన ఆలయ కమిటీలు

తుని రూరల్: కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు పలు గ్రామాల్లో ఆలయాలు, అమ్మవారి విగ్రహాలను ముస్తాబు చేశారు. ఎస్.అన్నవరంలో గురువారం రాత్రి జాగరణ, 28న తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఆలయం, అమ్మవారి విగ్రహాలకు రంగులు వేసి, గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా క్యూలైన్లు సిద్ధం చేశారు.

జాగరణ సందర్భంగా గరివిడి చినలక్ష్మి బుర్రకథ, అమ్మవారి గరగల నృత్యాలు, ఆర్కెస్ట్రా, డీజే డ్యాన్స్ ప్రోగ్రాం, ఢీ3 సినీ కళాకారుల డ్యాన్స్ ప్రోగ్రాం, శక్తివేషాలు, తదితర సాంఘిక, జానపద కార్యక్రమాల ఏర్పాటు చేశారు. 28న రేఖవానిపాలెం, రాపాక, కేఓ.మల్లవరం, హంసవరం, తేటగుంట, డి.పోలవరం, ఎన్‌వీఎస్‌వీ నగరం, చామవరం, టి.తిమ్మాపురం, లోవకొత్తూరు తదితర గ్రామాల్లో జాతరలు, తీర్థాలు నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎస్.అన్నవరంలో ముస్తాబైన నూకాలమ్మ ఆలయం



ఎస్.అన్నవరంలో కొలువైన నూకాలమ్మతల్లి

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

తుని: జవహర్ నవోదయ విద్యాలయ సమితి జనవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ బుధవారం తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న ముత్యాల విశ్రుత్, మేడిశెట్టి అవీష్, కొంజర్ల వెంకట చంద్రమౌళి, దూలపల్లి విఖ్యాత్ ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌కే నరసింహారావు, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాజెక్టుల ప్రదర్శన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సీఎస్ఈ విభాగంలో బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బుధవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2025 కార్యక్రమం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో వైస్ ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి, సృజనాత్మక పరిష్కారాలను ప్రతిపాదించారన్నారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్-అకాడెమిక్ ఎస్ రమాశ్రీ, డీన్స్, తదితరలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



హైవేపై రామవరం వద్ద జరిగిన ప్రమాద దృశ్యం

జగ్గంపేట: పదహారో నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో త్రుటిలో ప్రాణనష్టం తప్పింది. స్థానికులు, రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న రెండు ట్రాలీ లారీలు మండలంలోని రామవరం శివారు బంక్ వద్దకు వచ్చే సరికి పక్కనే వెళుతున్న కంటైనర్‌ను తప్పించే ప్రయత్నంలో వెనకే వస్తున్న హైషర్ వ్యాన్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హైషర్ వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతడిని హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలి



ఉపాధ్యాయ ఉద్యమ నేతలు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ ఉద్యమ నేతల స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కోడి శ్రీను కోరారు. మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యాన ప్రత్తిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఉపాధ్యాయ ఉద్యమ నేతలు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణ రాజు వర్ధంతి సభ జరిగింది. తొలుత అప్పారి, వత్సవాయి చిత్రపటాలకు ఉపాధ్యాయ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడి శ్రీను మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అప్పారి, వత్సవాయి బాటలో పయనించాలన్నారు. వారి సేవలను మననం చేసుకుంటూ భవిష్యత్తు కార్యాచరణ దిశగా ఉపాధ్యాయ వర్గం పయనించాలని కోరారు. అప్పారి, వత్సవాయి సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రాపర్తి రామలింగేశ్వరుడు, యూటీఎఫ్ నాయకులు డి. రాజబాబు, వీవీ రమణ, జి.ప్రసాద్‌బాబు, గణేష్, రాము, సాయి ప్రసాద్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఖో.. పసిడి పట్టుఖో..



డీఎస్ఏలో జరుగుతున్న రాష్ట్రస్థాయి శిబిరంలో వ్యాయామం చేస్తున్న క్రీడాకారులు


నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): వారంతా నిరుపేద కుటుంబాల వారే. చదివేది సర్కారీ కళాశాలల్లోనే. గ్రామీణ క్రీడల్లో ఒకటైన ఖోఖో వారి ఊపిరి. పదేళ్లుగా సాధన చేసి ఈ నెలాఖరున పూరీలో ప్రారంభం కానున్న జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్లుగా నిలవాలని లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్ర ఖోఖో సంఘం సహకారంతో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెసిడెన్షియల్ ఖోఖో శిబిరంలో ముమ్మర సాధన చేస్తున్నారు. వారి సాధన, లక్ష్యాలను బుధవారం సాక్షితో పంచుకున్నారు.

ఒడిశా రాష్ట్రంలోని పూరీలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జాతీయ స్థాయి సీనియర్స్ మహిళల ఖోఖో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు బాపట్ల జిల్లా జె.పాంగులూరులో ఈ నెల 16న రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది హాజరుకాగా 15 మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఖోఖో సంఘ కార్యదర్శి సీతారామ రెడ్డి వీరికి ఈ నెల 22 నుంచి 28 వరకు స్థానిక డిఎస్ఏలో రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో ఉమ్మడి తుర్పు గోదావరి జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి పట్టాభి, ఖోఖో కోచ్ వాసు ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 8 వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు ఉచిత, భోజన సదుపాయాలు కల్పించి శిక్షణ అందిస్తున్నారు. ఫిట్‌నెస్‌తో పాటు టీం వర్క్, కోఆర్డినేషన్, టిక్‌ట్యాక్ టెక్నిక్స్, స్కిల్స్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి అనుష, నందిని ఈ జట్టులో స్థానం దక్కించుకున్నారు. 2002లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి క్రీడల్లో బాలికల విభాగంలో రాష్ట్ర జట్టు బంగారు పతకం సాధించింది. మళ్లీ ఈ ఏడాది స్వర్ణ పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్టు క్రీడాకారులు చెప్తున్నారు.

రాష్ట్ర జట్టు సభ్యులు వీరే

కె.రమ్య (నెల్లూరు), పి.చెక్ర అనూష (తూర్పు), టి.అనిత (పశ్చిమ), హేమ (విశాఖ), శివనాగలక్ష్మి (ప్రకాశం), కుమారి (తూర్పు), దివ్యశ్రీ (ప్రకాశం), పావని (ప్రకాశం), బి.మౌనిక (కృష్ణా), ఇ.హేమవతి(ప్రకాశం), భార్గవి (నెల్లూరు), శ్రావణి (విజయనగరం), నందిని (కాకినాడ), మునిలక్ష్మి (చిత్తూరు), వైష్ణవి (గుడివాడ).

జాతీయస్థాయిలో 15వ సారి



నా పేరు చక్ర అనూష. మాది కిర్లంపూడి. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఇప్పటి వరకు 14 సార్లు నేషనల్స్‌లో ఆడాను. నాది డిఫెన్స్ స్థానం. క్రీడల్లో రాణించి రైల్వేలో ఉద్యోగం సాధించడం నా లక్ష్యం. ఖోఖో కోచ్ వాసు వద్ద శిక్షణ పొందుతున్నాను.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రౌతులపూడి: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిజనిర్ధారణ కమిటీ వేసి క్రైస్తవ సంఘాల అనుమానాలను నివృత్తి చేయాలని మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శామ్యూల్ డిమాండ్ చేశారు. రౌతులపూడిలో బుధవారం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మృతి క్రైస్తవులకు తీరని లోటు అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి యాదగిరి జ్యోతిబాబు, కన్వీనర్ గంటా భాస్కర్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ బీఎం జయకుమార్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



లింగంపర్తిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని లింగంపర్తిలో మండల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో ఎటువంటి అవకతవకలు లేకుండా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎస్‌జీవీ సుబ్బరాజు, పెట్టకోట శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రామరాజు వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

తుని రూరల్: ఎస్సీ, బీసీ, ఓసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందగోరు దరఖాస్తుదారులకు, రుణాలు మంజూరు చేసే బ్యాంకర్లకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లకు నిర్దేశించినట్టు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారులు సకాలంలో హాజరవ్వాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం



తునిలో మజ్జిగను పంపిణీ చేస్తున్న దాడిశెట్టి శ్రీనివాస్

తుని: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ధనలక్ష్మి గోల్డ్ షాపింగ్ మాల్ అధినేత దాడిశెట్టి శ్రీనివాస్ బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తుని మార్కెట్‌కు వచ్చే ప్రజలకు వేసవి ముగిసే వరకూ ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాడిశెట్టి విష్ణుచక్రం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గండేపల్లి: జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ ఆఫీస్‌కు సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, జగ్గంపేట, గండేపల్లి ఎసైలు, సిబ్బంది పాల్గొన్నారు.

'అనపర్తి' కుటుంబానికి పరామర్శ



ముక్కొల్లులో మృతుడు కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గిరిబాబు

కిర్లంపూడి: ముక్కొల్లు గ్రామానికి చెందిన అనపర్తి కృష్ణ ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. కాగా వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం ముక్కొల్లులో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.